పీయూసీ పరీక్షలు ప్రారంభం


బళ్లారిలోని ఓ ప్రైవేట్ కళాశాల వద్ద విద్యార్థుల సందడి 6

హైవే పై.. ఏఐ నిఘా..!

● జాతీయ రహదారులపై హద్దు మీరితే కొరడా ● నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా తప్పదు ● ఏఐ సాంకేతిక కెమెరాలతో ప్రత్యేక నిఘా ● 300 మీటర్ల వరకు వాహనాలను గుర్తించే అవకాశం


ఏఐ కెమెరా

బెంగళూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులపై భారీ ప్రమాదాలతో తరచూ ప్రాణనష్టం వాటిల్లుతోంది. రహదారుల విస్తరణ, నాణ్యమైన రోడ్లు వంటి సౌకర్యాలు పెరిగినా ప్రమాదాల్లో మృతులు పెరుగుతుండడాన్ని నియంత్రణ చేసేందుకు రాష్ట్రప్రభుత్వం కీలక నిర్ణయానికి సిద్ధమైంది. రవాణా, పోలీసుశాఖలు సంయుక్తంగా అతివేగంతో ప్రయాణించే వాహనాలను, రవాణా నిబంధనలు ఉల్లంఘించేవారిపై జరిమానా కొరడా విధించాలని నిర్ణయించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఏఐ కెమెరాలకు దొరికిపోతారు.

ప్రమాదాల నివారణకే..

జాతీయ, రాష్ట్ర రహదారులపై వాహనదారుల అతివేగం, నిబంధనలు పాటించకపోవడం వంటి సంఘటనలు పెరుగుతున్నాయి. వాహనాలు నడిపేవారు కనీసమైన సురక్షిత నిబంధనలు పాటించాలని ఎన్నో విధాలా అవగాహన కల్పిస్తున్నా నిర్లక్ష్యం చేస్తున్నారు. రవాణాశాఖ రాష్ట్రంలో ప్రమాదాలను తగ్గించాలని అందుకు చైతన్యంతోపాటు నిబంధనల పేరిట దాడులతో సాధ్యం కావడం లేదని సాంకేతికతమైన విధానాలు తీసుకురావాలని నిర్ణయించింది. అందుకు పోలీసుశాఖ సహకారంతో అమలు చేయదలిచారు.

అత్యాధునిక కెమెరాలు..

రాష్ట్రంలో వాహనాల సంచారం అధికంగా ఉండే రహదారులు, ప్రమాదాలు ఎక్కువగా జరిగే నేషనల్ హైవేలలో కృత్రిమ మేధస్సు (ఏఐ సాంకేతిత)తో పనిచేసే సీసీ కెమెరాల ద్వారా నిఘా ఏర్పాటు చేయనున్నారు. కెమెరాల్లో వాహన నెంబర్లను గుర్తించేందుకు రాష్ట్రంలో 7 ప్రాంతాల్లో ఇటువంటి విధానాన్ని మార్చి ఆఖరులోగా అమర్చి కార్యాచరణ చేపట్టదలిచారు. రానున్న ఆరు నెలల్లో మరో 20చోట్ల అమలు చేయనున్నారు. కెమెరాల ద్వారా 300 మీటర్ల దూరం వరకు వాహనాల దృశ్యాలను గుర్తించగలిగే అవకాశం ఉంది. వాహనం ఎంత వేగంగా ప్రయాణించింది, ఎక్కడ నిబంధనలు ఉల్లంఘించింది కూడా డిజిటల్ డిస్‌ప్లే బోర్డులో ప్రదర్శించనుంది. ఇందుకు సంబంధించిన వివరాలను సౌండ్ ద్వారా వెల్లడించేయనుంది. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించనుంది. ఏఎన్‌పీఆర్ కెమెరాలు బెంగళూరు ట్రాఫిక్ సెంట్రల్ కార్యాలయంలోని కమాండ్‌సెంటర్‌కు అనుసంధానం చేయబడి ఉంటాయి. వెబ్ ఆధారిత సారథి 4, వాహన 4.0 సాంకేతికత అనుసంధానం చేశారు. కెమెరాల్లో వాహనం నెంబరు గుర్తించిన వెంటనే నిబంధనల ఉల్లంఘనతోపాటు సంపూర్ణ వివరాలు కమాండ్ సెంటర్‌కు చేరుతాయి. కమాండ్ సెంటర్ సిబ్బంది వాటిని ప్రింట్ రూపంలో తీసుకొస్తారు. వాహనాల పర్మిట్, ఎఫ్‌సీ, బీమాతోపాటు ఇతర వివరాలు గడువులో ఉన్నాయా లేదా కూడా గుర్తించవచ్చు. ట్యాక్స్ పెండింగ్ వివరాలు తేల్చనున్నారు. వీటితోపాటు ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన, పెండింగ్ కేసుల సమాచారం కూడా తెలియనుంది. వీటి ఆధారంగా కమాండ్ సెంటర్ నుంచి వాహన యజమానికి జరిమానా నోటీసు జారీ చేస్తారు.

ఎక్కడెక్కడ నిఘా వ్యవస్థ...

ప్రస్తుతానికి బెంగళూరు - మైసూరు ఎక్స్‌ప్రెస్ వే శ్రీరంగపట్టణ వద్ద, ఎక్స్‌ప్రెస్ వే బెంగళూరు ప్రవేశమార్గంలోనూ, హోసూరు రోడ్డు అత్తిబెలె వద్ద, ఎన్‌హెచ్ 7 దేవనహళ్ళి టోల్‌వద్ద, నేషనల్ హైవే 4 పార్లెజీ ఫ్యాక్టరీ వద్ద, తుమకూరులోని క్యాత్సంద్ర వద్ద, 73వ జాతీయ రహదారిపై హిట్నాళ్ టోల్ వద్ద నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయదలిచారు. జాతీయ రహదారులపై వాహనాల అతివేగం, నిబంధనల ఉల్లంఘన పరిశీలించేందుకు ఆటోమేటిక్ నెంబర్‌ప్లేట్ రికగ్నిషన్ (ఏఎన్‌పీఆర్) కెమెరాలను అమర్చదలిచారు. వాహనాల వేగం వివరాలతోపాటు డిజిటల్ డిస్‌ప్లే బోర్డు కూడా ఏర్పాటు చేయనున్నారు. డిజిటల్ డిస్‌ప్లే బోర్డు, కెమెరాల మధ్య అనుసంధానం అయి ఉంటాయి. డ్రైవర్ మొబైల్ మాట్లాడినా, సీటు బెల్టు లేకున్నా కూడా అందుకు సంబంధించిన ఫొటో వివరాలు లభించనున్నాయి. బెంగళూరు నగర వ్యాప్తంగా 6వేలకుపైగా హై టెక్నాలజీ సీసీ కెమెరాలను అమర్చి కమాండ్ సెంటర్ పర్యవేక్షణలో పనిచేస్తున్నాయి. జాతీయ రహదారులలోనూ వాటిని తీసుకురావడం ద్వారా ప్రమాదాలను నియంత్రించాలనేది ప్రధాన ఆలోచనగా ఉంది.

సమావేశాలకు సర్వం సిద్ధం



● రేపు ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించనున్న గవర్నర్ ● 'ముడా' పై చర్చకు కత్తులు నూరుతున్న ప్రతిపక్షాలు

బెంగళూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): శాసనసభ సమావేశాలకు సర్వం సిద్ధమైంది. 2025 ఏడాదిలో తొలిసారి శాసనసభ సమావేశాలు ఈనెల 3న సోమవారం ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం విధానసౌధలోని శాసనసభ, విధానపరిషత్‌ల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్, సభాపతి బసవరాజ హొరట్టి శాసనసభ కలాపాలకు సంబంధించిన ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. శాసనసభ కార్యదర్శి విశాలాక్షి, పరిషత్ కార్యదర్శి మహాలక్ష్మి మూడు రోజులుగా విధానసౌధలోనే ఉంటూ పర్యవేక్షిస్తున్నారు. శాసనసభ కలాపాలు మార్చి నెలలో సుదీర్ఘకాలం కొనసాగనున్నాయి. సోమవారం ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ ప్రసంగించనున్నారు. శాసనసభ్యులు, పరిషత్ సభ్యులు అసెంబ్లీ ప్రాంగణంలో పాల్గొననున్నారు. ఏడాది ప్రారంభంలో గవర్నర్ ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించే సంప్రదాయం కొనసాగుతోంది. ఆ తర్వాత గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే కార్యక్రమాలు జరగనున్నాయి.

తొలిరోజు సజావుగానే... ఆ తర్వాతే...

శాసనసభ సమావేశాలు తొలిరోజున గవర్నర్ ప్రసంగించనుండడంతో సజావుగానే కలాపాలు జరిగే అవకాశం ఉంది. గవర్నర్ ప్రసంగం ముగిశాక ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వాన్ని విమర్శించవచ్చు. అయితే తొలిరోజు కలాపాలు సాధారణంగా సాగే అవకాశం ఉంది. ఆ మరుసటి రోజునుంచే అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య ఇటీవల కొనసాగిన పలు కీలక అంశాలపై రసాభాస కొనసాగే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి సిద్దరామయ్యపై ముడా ఇంటి స్థలాల అవినీతి ఆరోపణలను విచారించిన లోకాయుక్త క్లీన్‌చిట్ ఇవ్వడంపై ప్రతిపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. దీంతో ఈ అంశం హాట్‌టాపిక్‌గా మారే అవకాశాలు ఉన్నాయి. అయితే కీలక అంశాల్లో అధికార పక్షాన్ని ఇబ్బంది పెట్టడానికి ప్రతిపక్షాలు కత్తులు నూరుతున్నాయి. అయితే తిప్పికొట్టడానికి పాలక పక్షం సిద్ధంగా ఉంది.

నోటీసు ఇస్తే రాజీనామా చేస్తా

● అధికార కాంగ్రెస్‌పై పరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి ఆగ్రహం



బెంగళూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): శాసనసభ సమావేశాల వేళ అధికార కాంగ్రెస్ పార్టీ నోటీసులు ఇస్తే పరిషత్ సభాపతి హోదాకు రాజీనామా చేస్తానని బసవరాజహొరట్టి హెచ్చరించారు. విధానసౌధలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఒక సాధారణ ఉపాధ్యాయుడిగా వృత్తిని ప్రారంభించి వరుసగా ఏడుసార్లు ఎమ్మెల్సీగా ఎన్నికయ్యానన్నారు. మంత్రిగా, సభాపతిగా పనిచేశానన్నారు. పరిషత్‌లో కొన్ని అంశాలపై కీలక చర్చలు జరగాల్సి ఉందన్నారు. డ్రగ్స్‌కు బానిసలై చిన్నారులు బలవుతున్నారని ఈ అంశంపై చర్చ జరగాల్సి ఉందన్నారు. శాసనసభ సంయుక్త సలహా కమిటీ సభ జరిపేందుకు స్పీకర్ యూటీ ఖాదర్, ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు విన్నవించారన్నారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు సభ జరగనుందన్నారు. బెంగళూరు నగర అభివృద్ధిపై చర్చకు సీనియర్ సభ్యుడు హెచ్ విశ్వనాథ్ ప్రస్తావించారన్నారు. విధానపరిషత్‌లో కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ ఉందని వారు నోటీసులు ఇస్తే రాజీనామా చేస్తానన్నారు. బెళగావి శాసనసభ కలాపాల వేళ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్, ఎమ్మెల్సీ సీటీ రవిల మధ్య జరిగిన సంఘటన ఇప్పటికే ముగిసిందన్నారు. డిసెంబరు 19న నిర్ణయం తీసుకున్నానన్నారు. ప్రస్తుతం నిర్ణయం పరిషత్ ఎథిక్స్ కమిటీ ముందు ఉందని, వారు తీసుకునే నిర్ణయానికి అనుగుణంగా తీర్మానం ఉంటుందన్నారు. శాసనసభలో ఎమ్మెల్యేల విశ్రాంతి కోసం ప్రత్యేక కుర్చీల ఏర్పాటుపై మాట్లాడుతూ పరిషత్‌లోనే సభ్యులు ఆసక్తిగా కూర్చుంటారన్నారు. మధ్యాహ్నం భోజనం తర్వాత కూడా సభ్యులు సభలోనే ఉంటారన్నారు. పరిషత్‌కు సంబంధించి ఇక ఎక్కువగా మాట్లాడేది లేదన్నారు. ఉపసభాపతి ఎంకే ప్రాణేశ్ ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి ఓట్ల లెక్కింపు మరోసారి కొనసాగినందున ఈ అంశం కోర్టులో ఉందని మాట్లాడేది లేదన్నారు.

ఎవరైనా రేప్ చేశారా..?

● సెలవు పెట్టిన ఉద్యోగికి వేధింపులు
● ఉన్నతాధికారులకు బాధితురాలి ఫిర్యాదు

బెంగళూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఐదు రోజుల సెలవుపై వెళ్లిన ఉద్యోగి పట్ల బీబీఎంపీ అసిస్టెంట్ కమిషనర్ అనుచితంగా వ్యాఖ్యానించారని బాధితురాలు శుక్రవారం ఫిర్యాదు చేశారు. బీబీఎంపీ స్పెషల్ కమిషనర్‌కు చేసిన ఫిర్యాదులో తన గోడు వెళ్లబోసుకుంది. మహిళా ఉద్యోగులపట్ల అసిస్టెంట్ కమిషనర్ అనుచితంగా మాట్లాడతారనే ఆరోపణలున్నాయి. ఇటీవల సొంత పనులకోసం సెలవుపై వెళ్లి తిరిగి విధులకు వచ్చినప్పుడు ఎవరైనా రేప్ చేశారా..? హెచ్ఐవీ సోకిందా...? అంటూ మానసికంగా వేధించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే సర్వీస్ రిజిస్టర్‌లో నిర్లక్ష్యంగా రాస్తానంటూ బెదిరించినట్లు బాధితురాలు ఆరోపించారు.


కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామికి అవార్డు ప్రదానం చేస్తున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు..

మంత్రాలయంలో ప్రముఖులకు అవార్డులు

మంత్రాలయం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి గురు వైభోత్సవాల్లో భాగంగా పట్టాభిషేక మహోత్సవాలను పురస్కరించుకుని శనివారం రాత్రి యోగీంద్ర కళామండపంలో ప్రముఖులకు అవార్డులను ప్రధానం చేశారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమరస్వామి, కర్ణాటక రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి బోసురాజు, తమిళనాడు హైకోర్టు జడ్జి జస్టిస్ సుబ్రహ్మణ్యంలకు పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు గురు వైభవోత్సవ-2025 అవార్డులను ప్రధానం చేశారు. అవార్డుతోపాటు నగదు, వెండిపల్లెం, శేషవస్త్రం, మెమెంటో, ఫలపుష్ప మంత్రాక్షింతలు, పరిమళ ప్రసాదం ఇచ్చి సత్కరించారు. ఈ అవార్డులు అందుకోవడం పూర్వజన్మ సుకృతమని అవార్డు గ్రహీతలు అన్నారు. శనివారం వేర్వేరు సమయాల్లో మంత్రాలయం వచ్చారు. వీరికి మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు వెంకటేశ్ జోషి, సురేష్ కోనాపూర్‌లు ఘన స్వాగతం పలికారు.

సమాజానికి సినిమా మార్గదర్శకం కావాలి

● అంతర్జాతీయ చలనచిత్రోత్సవం ప్రారంభంలో సీఎం


జ్యోతి వెలిగించి చిత్రోత్సవాలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): సినిమా సమాజానికి ఓ మార్గదర్శకం కావాలని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. శనివారం రాత్రి విధానసౌధ ప్రాంగణంలో 16వ అంతర్జాతీయ చలనచిత్రోత్సవాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఎనిమిదిరోజులపాటుసాగే ఫిలిం ఫెస్టివల్‌లో 60కుపైగా విదేశీ సినిమాలతోపాటు దేశంలోని వివిధ భాషల సినిమాలను ప్రదర్శించనున్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ శాండల్‌వుడ్‌రంగం భిన్నమైనదని, కన్నడ సినిమాలను రాష్ట్రమంతటా నేటికీ ఆదరించేవారు కోకొల్లలు ఉన్నారన్నారు. అందుకే కన్నడ సినిమా లంటే ప్రతి కన్నడిగుడు గర్వంగా భావిస్తారన్నారు. 13 స్క్రీన్‌ల ద్వారా 200 సినిమాలు, 400 ప్రదర్శనలు సాధ్యం కానున్నాయన్నారు. కార్యక్రమంలో డీసీఎం డీకే శివకుమార్, విధానపరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి, మంత్రి కేజే జార్జ్, పరిషత్ చీఫ్ విప్ సలీం అహ్మద్, చలనచిత్ర వాణిజ్యమండలి అధ్యక్షుడు సాధుకోకిల తదితరులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథులుగా నటుడు శివరాజ్‌కుమార్, ప్రత్యేక ఆహ్వానితుడు, చలనచిత్రోత్సవ రాయబారి కిశోర్‌కుమార్ వ్యవహరించారు. ప్రముఖ సంగీత దర్శకులు పద్మవిభూషణ్ డాక్టర్ ఎల్ సుబ్రమణ్యం, ప్రముఖ గాయని కవితాసుబ్రమణ్యాల సంగీత విభావరి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.


నృత్య ప్రదర్శనలో విద్యార్థులు

ఆట..పాట..!

హంపి ఉత్సవాల్లో రెండో రోజు శనివారం సాంస్కృతిక కార్యక్రమాలు..ఆటల పోటీలు అలరించాయి. హంపిలో ఏ వేదికలో చూసినా జనం విశేషంగా తరలివచ్చారు. పలువురు ప్రముఖులు, సినీ తారల రాకతో సందడి నెలకొంది. 6


కుస్తీ పోటీల్లో ఉత్సాహంగా యువకులు



బంతిపూలు.. నేలపాలు..!


● ధరలు పడిపోవడంతో రోడ్డు పక్కన పడేసి పోతున్న రైతులు

హోసూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): బంతి పూల రైతులకు తీవ్ర నష్టాలు వేధిస్తున్నాయి. హోసూరు జిల్లాలో బంతిపూలు అధికంగా సాగు చేస్తారు. అయితే పది రోజులుగా బంతిపూలకు సరైన ధరలు లేకపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హోసూరు పరిసర ప్రాంతాల్లో 70 శాతం మంది రైతులు బంతి పూలు, గులాబీ వంటి పూలసాగు చేస్తున్నారు. ఇక్కడ పండించిన పూలు హోసూరు పూల మార్కెట్ నుంచి తమిళనాడులోని పలు జిల్లాలతో పాటు కర్ణాటక, కేరళ తదితర రాష్ట్రాలకు ఎగుమతి అవుతాయి. అయితే అన్‌సీజన్‌లో పూలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్టపోతున్నట్లు రైతులు వాపోతున్నారు. 100 కిలోల పూల మార్కెట్‌కు తీసుకెళ్తే 20 కిలోల మాత్రమే కొంటున్నారని అదికూడా కేజీ రూ.20, 30కే అడుగుతున్నారని వాపోతున్నారు. దీంతో అమ్ముకోలేక మిగిలిన పూలను రోడ్డుపక్కన పారేసి వెళ్తున్నారు. కూలీలు కూడా రావడం లేదని వాపోతున్నారు. శుభ కార్యాలు లేక ధరలు పడిపోయాయని వ్యాపారులు అంటున్నారు.


దెబ్బతిన్న కారు, రోడ్డుపైనే క్షతగాత్రులు 6

డివైడర్‌ను ఢీకొన్న కారు

● చిన్నారి మృతి..ఆరుగురికి గాయాలు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1607.26	1,586.66
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	7,068	886
నీటి నిల్వ (టీఎంసీలు)	32.49	8.46

డివైడర్‌ను ఢీకొన్న కారు

చిన్నారి మృతి..ఆరుగురికి గాయాలు

బళ్లారిరూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : తాలుకాలోని పీడీహళ్లి గ్రామ జియో పెట్రోల్ కారు డివైడర్‌ను ఢీ కొని చిన్నారి మృత్యువాత పడింది. శుక్రవారం రాత్రి పంప్ సమీపంలో భద్రావతి నుంచి గుంతకల్లుకు కారులో అంత్యక్రియల్లో పాల్గొనేందుకు కుటుంబ సభ్యులు దాదాపు పది మంది బయలుదేరారు. వేగంగా వచ్చిన కారు డివైడర్‌ను ఢీ కొనడంతో కారులోని వారు కిందపడి పలువురికి గాయాలయ్యాయి. తీవ్ర గాయాలైన నాలుగేళ్ల చిన్నారి అక్కడికక్కడే మృతి చెందింది. మరో ఆరుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. సమాచారం అందుకున్న పీడీ హళ్లి పోలీసులు బాధితులను 108 వాహనంలో బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం



అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌బీ పాటిల్

సిరుగుప్ప, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : సబ్సిడీ ధరలో వ్యవసాయ పరికరాలు పంపిణీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సిరుగుప్ప తాలుకా వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌బీ పాటిల్ తెలిపారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ సిరుగుప్ప తాలుకా వ్యాప్తంగా వున్న రైతులు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ పరికరాలు టిల్లర్, రొటేవేటర్ తదితర పరికరాలను వివిధ పరికరాలు ప్రభుత్వం అందజేసింది. వాటి కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రైతులు కుల ధ్రువీకరణ పత్రాలను జతపరచి దరఖాస్తులు అందజేయాలన్నారు.

పీయూసీ పరీక్షలు ప్రారంభం

తోరణగల్లు/బళ్లారి రూరల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి) : అఖండ బళ్లారి జిల్లాలోని 43 కేంద్రాల్లో పీయూసీ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. సండూరు తాలుకా కేంద్రంలో రెండు ప్రభుత్వ పాఠశాలల్లో పీయూసీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. సండూరు పట్టణంలోని ఏపీఎంసీ మార్కెట్ సమీపంలోని ప్రభుత్వ కళాశాలలో 508 మంది విద్యార్థులలో 29 మంది విద్యార్థులు గైర్హాజరు కాగా 479 మంది విద్యార్థులు మొదటి పరీక్షగా కన్నడ పరీక్ష రాయడం జరిగింది. అలాగే బాలికల ప్రభుత్వ పాఠశాలలో 585 మంది విద్యార్థులలో పది మంది గైర్హాజరు కాగా 575 మంది విద్యార్థులు మొదటి పరీక్షలు రాశారు. ఎ లాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం జరిగిందని ముఖ్య శిక్షకులు మంజునాథ, చంద్రప్ప తెలిపారు. విద్యార్థులు ఉదయాన్నే తమ తమ కాలేజీలకు వెళ్లి వారి రోల్‌నెంబర్లను చూసుకొని విద్యార్థులు ఆసక్తికరంగా పరీక్షలు రాసేందుకు కళాశాల వద్దకు రావడంతో కళాశాలల వద్ద సందడి నెలకొంది.

సిగ్నల్ దాటిన రాయచూరు ప్యాసింజర్

● లోకో పైలెట్ సస్పెన్షన్..?

గుంతకల్లు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఓ ప్యాసింజరు రైలు రెడ్ సిగ్నల్‌ను దాటడంతో లోకో పైలెట్‌ను అధికారులు సస్పెండ్ చేసినట్లు తెలిసింది. శనివారం రాయచూరు-గుంతకల్లు ప్యాసింజరు రైలును ఇస్వీ స్టేషన్ వద్ద రెడ్ సిగ్నల్‌ను దాటి నిలిపినట్లు సమాచారం. రైల్వే సేఫ్టీ నిబంధనల ప్రకారం రెడ్ సిగ్నల్ ఇచ్చిన చోట ఆ సిగ్నల్‌ను రైలింజన్ ఎట్టి పరిస్థితుల్లో దాటడానికి వీలులేదు. అలా రెడ్ సిగ్నల్‌ను కొంచెం దాటినా సిగ్నల్ పాస్ట్ అట్ డేంజర్ (స్పాడ్) కేసుగా లెక్కించి బాధ్యులైన లోకో పైలెట్, సహాయ లోకో పైలెట్‌పై చర్యలు తీసుకుంటారు. ప్యాసింజరు రైలు సిగ్నల్ దాటిన సంఘటనలో ఎల్పీ హేమంత్ కుమార్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిసింది.

రెండు నాటు తుపాకుల స్వాధీనం

కణేకల్లు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని సొల్లాపురం-కౌకుంట్ల గ్రా మాల మధ్య శనివారం రెండు నాటు తుపాకులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగమధు తెలిపారు. సొల్లాపురం గాలిమరల వద్ద నాటు తుపాకులు ఉండగా అక్కడ పనిచేసే సిబ్బంది సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి వెళ్లి స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. నాటు తుపాకులు ఎవరివనేవి సమాచారం లేదని, విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.



శశ్వేకాళ్ గణప్ప వేదికపై బాలికల భరత నాట్యం



గుండు ఎత్తే పోటీల్లో..

ఆట..పాట..!

హోస్పేట, కంప్లి, మార్చి 01 (ఆంధ్రజ్యోతి) : హంపి ఉత్సవాలకు రెండవ రోజు శనివారం ఆటపాటలతో, సాంస్కృతి కార్యక్రమాలతో ఉత్సాహంగా గడిపారు. ఏ వేదికలో చూసినా జనమే అలాగే ముఖ్యంగా మంత్రి ఎస్‌కే పాటిల్ సినీతారలు కూడా రెండవ రోజు హంపికు చేరుకుని వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ హంపి ఉత్సవాలు కన్నడ, తెలుగు, తమిళ ఇతర భాషలకు ఎంతో ప్రాధాన్యం దాల్చుతుందన్నారు. ప్రతి వేదికలో జనసంబ్రమం కనిపిస్తోంది. ఉదయం భువనేశ్వర హోటల్ వద్ద ఎమ్మెల్యే గవియప్ప బైస్కైను ప్రారంభించారు. అనంతరం గొర్రెలు, మేకల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గెలిచిన వాటికి బహుమతులను అందించారు. శాశ్వేకాళ్ గణప్ప వేదిక వద్ద నృత్యకారులు భరతనాట్యంతో ఆకట్టుకున్నారు. ఎంపీ ప్రకాష్ వేదికలో సినీతారలు నృత్యాలతో ఆకట్టుకున్నారు. అలాగే ధ్వని బెళుకు నృత్యాలు పూర్తిగా కనువిందు చేశాయి. కమలాపురం చెరువులో మంత్రి జమీర్ అహ్మద్ బోటింగ్‌లో విహారం చేపట్టారు. విజయవిఠల దేవస్థానం వద్ద యోగా చేపట్టారు. అలాగే పుష్పాలంకరణ, వస్తు ప్రదర్శనలో పండ్లపై వివిధ నాయకులు, పువ్వుల చిత్రాలను అందంగా ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. అనంతరం నవదిబ్బ వద్ద బైకు రేసు కూడా ఆకట్టుకున్నారు. గాంధీ మహాత్ముని వేషభూషణలు, కుస్తీ పోటీలు, బండరాళ్లు ఎత్తే పోటీలు, ఒంటి చేత్తో ఎద్దులబండి చక్రం తీసే పోటీలు, ఎదురు బసవన్న వేదికలో సంగీత కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భరతనాట్యంతో ఆకట్టుకున్నారు.



బైక్ విన్యాసాలు..



విజయవిఠల దేవస్థానం వద్ద యోగాలో పాల్గొన్న ప్రజలు

సంగీతంతో ఖైదీల మనసులో మార్పు: కలెక్టర్

బళ్లారి సిటీ,మార్చి 1(ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక కార్యక్రమాలు, తేలిక పాటి సంగీతం, నాటకాలు ఖైదీల మనసులను మార్చడంలో సహాయపడుతాయని జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా అన్నారు. కేంద్ర జైలు, కన్నడ సాంస్కృతిక శాఖ సహకారంతో జిల్లా కేంద్ర జైలు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన మనసుమార్చే వినోద కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నాటకాలు, కళా, సాంస్కృతిక కార్యక్రమాలు సమాజాన్ని సంస్కరించడానికి నిరంతరం కృషి చేస్తున్నాయి. ఇది ఒక వ్యక్తిలో కొత్త స్ఫూర్తిని సృష్టిస్తుంది, వారి మనస్సును పరివర్తన చేస్తుంది. సమాజంలో నమ్మకంగా జీవించడం సాధ్యమేనన్నారు. సెంట్రల్ జైల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఉమ్మీ తస్నియా మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు ఖైదీలకు మానసిక పరివర్తన వినోదాన్ని అందిస్తాయని అన్నారు. ఖైదీలు కూడా ఇటువంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని పాల్గొని తమ ప్రతిఘటన ప్రదర్శించవచ్చని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో శంకరబండ యల్లనగౌడ బృందం నాటక ప్రదర్శన తేలికపాటి సంగీతం ప్రదర్శించారు. ఈసందర్భంగా కన్నడ సాంస్కృతిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.నాగరాజు,పోలీసు శాఖతో సహా వివిధ విభాగాల సిబ్బంది ఖైదీలు పాల్గొన్నారు.



మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

గోనెసంచుల్లేవ్..!

● ఆగిపోయిన జొన్న, రాగి కొనుగోళ్లు...

● ఇబ్బంది పెట్టడానికే సాకులు : రైతుల ఆగ్రహం

బళ్ళారి గాంధీనగర్, మార్చి 1(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో కనీస మద్దతు ధర పథకం క్రింద ఖరీఫ్‌లో సాగుచేసిన జొన్న, రాగి కొనుగోలు ప్రక్రియ గోనె సంచుల కొరతతో నిలిచిపోయింది. ప్రారంభమై రెండున్నర నెలలు గడిచినా... గోనెలసంచుల కొరత నెపంతో అధికారులు అధికారులు కొనగోలు ప్రక్రియ ప్రారంభించక పోవడం పట్ల వరి, జొన్న సాగు రైతుల కల్లాలు, ఇళ్ళలోనే నిలువలు ఉండిపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ఏడాది డిసెంబరు 1వ తేదీన జొన్న ఖరీదుకు రైతుల పేరు నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. తెల్లజొన్న(మాల్దండి) క్వింటాల్‌కు రూ 3,421లు తెల్లజొన్న(హైబ్రిడ్) క్వింటాల్‌కు రూ 3,371లు, రాగి క్వింటాల్‌కు రూ 4,290లు మద్దతు ధర నిర్ణయించారు. రాష్ట్రంలో ఫిబ్రవరి 21వ తేదీ వరకు రూ 36.22లక్షల క్వింటాళ్ళ రాగి అమ్మడానికి 2.28 లక్షల మంది రైతులు నమోదు చేసుకున్నట్లు అధికారులు రికార్డుల తెలుపుతుండగా, 7.12క్వింటాళ్ళ జొన్న అమ్మకానికి 17,500 మంది రైతులు పేర్లు నమోదు చేసుకున్నారు. పశ్చిమ బంగ్లాదేశ్‌లో ఉన్న భారతీయుల సెణబు మండలి నుంచి గోనెసంచులు ఖరీదు చేస్తారు. ఆహార పౌరసరఫరా శాఖ నోడల్ ఏజెన్సీ ఉంది. అయితే ఖరీదు చేసిన గోనెసంచులను సంబంధిత ఏజెన్సీలు జిల్లావారీగా పంపిణీ చేస్తుంది. ఈ సారి గొనెసంచుల ఖరీదు కోసం జరిగిన టెండరు ప్రక్రియ ఆలస్యం అయ్యిందని, ఈ కారణంగా కొనుగోలు ప్రక్రియ ఆగిందని అధికారుల పేర్కొంటున్నారు. ఇది ఇలా ఉండగా... డిమాండ్‌కు తగ్గట్టుగా గోనెసంచుల సరఫరా కావడం లేదని, దశల వారీగా గొనెసంచులు పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని కోరినా ఇప్పటి వరకు 10శాతం మాత్రమే పంపిణీ జరిగిందని సమాచారం. గోనెల సంచుల లభించినా కేవలం కొన్ని రోజుల్లోనే ఖాళీ కావడంలో ఖరీదు ప్రక్రియ తిరిగి స్థంభించే అవకాశం ఉంది. ఖరీదు గురించి రైతులు పదే పదే అధికారులపై ఒత్తిడి తెచ్చినా... అధికారులు మాత్రం కంటితుడుపు మాటలతోనే సరిపుచ్చుతున్నట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై జిల్లా ఆహార పౌరపరా అధికారులు గోనెసంచుల కొరత కారణంగా కొనుగోలు ప్రక్రియ జరగలేదని, జిల్లాధికారి ప్రభుత్వంతో చర్చిస్తున్నట్లు కొన్ని రోజుల్లోనే సమస్య పరిష్కారమవుతుందని అభిప్రాయం వ్యక్తం చేస్తుండగా... .. గోనెలసంచుల నెపంతో ప్రభుత్వం కొనుగోలు ప్రక్రియ ప్రారంభించక పోవడం సరికాదని, వెంటనే పూర్తి ప్రమాణంలో గోనెసంచులు కొనుగోలు చేసి కొనుగోలు ప్రక్రియను ప్రారంభించాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



బళ్లారి ఏపీఎంసీ మార్కెట్

సర్వజన శాంతి తోట హంపి : మంత్రి పాటిల్



బళ్లారి, మార్చి 01(ఆంధ్ర జ్యోతి) : సర్వజనుల తోట హంపి అని ఇక్కడ అనేక జాతులు అనేకానేక బాషలు ఇక్కడ ఉన్నాయని హంపి సంస్కృతి కళాశిల్పాలు చరిత్ర, హంపి పవిత్ర స్థలం అని పర్యాటక శాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ అన్నారు. హంపి ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు శనివారం హెచ్‌కే ప్రకాష్ వేదికలో మంత్రి మాట్లాడారు. హంపికి మనమంతా వారసులమన్నారు. హంపితో పాటు కర్ణాటకలో అనేక పర్యాటక కేంద్రాలు ప్రసిద్ధి చెందడం మన అదృష్టమన్నారు. అనేక పర్యాటక ప్రాంతాలుండం రాష్ట్ర ప్రజల అదృష్టమన్నారు. హంపి ఉత్సవాలు ప్రతియేటా నిర్వహించడానికి ముందుగా ఎంపీ ప్రకాష్ కృషి చేశారన్నారు. హంపి వైభవం ఇక్కడ ఉన్న చారిత్రక కట్టడాలు శిల్పాలు ఆనాటి రాయల పాలనకు సాక్షంగా మనముందు కనిపిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, గవియప్ప, రజనీష్, అక్రమ్ బాషా, ఎస్పీ హరిబాబు, హోస్పేట నగరసభ అధ్యక్షులు రూపేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జయంతులను ఘనంగా నిర్వహించాలి

● ముందస్తు సమావేశంలో ఏడీసీ మహమ్మద్ జుబేర్



మాట్లాడుతున్న ఏడీసీ జుబేర్

బళ్లారి సిటీ,ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రేణుకాచార్య , యోగినారేయణ యతీంద్ర, అగ్నిబన్నిరాయ ప్రముఖుల జయంతులను ఘనంగా జరుపుకోవాలని అదనపు జిల్లాకలెక్టర్ మహమ్మద్‌జుబేర్ అన్నారు. శనివారం నగరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన మహనీయుల జయంతి ముందస్తు సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్చి 12న నగరంలోని జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరంలో రేణుకాచార్య జయంతి, మార్చి 14న నగరంలోని బలిజ భవన్‌లో యోగినారాయణ యతీంద్ర జయంతి, మార్చి 28న నగరంలోని జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరంలో అగ్నిబన్నిరాయ జయంతిని ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జయంతి వేడుకల సమయ కార్యక్రమంలో భాగంగా భారీ ఊరేగింపు నిర్వహించడానికి చక్కని ఏర్పాట్లు చేసుకోవాలని సంబందిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో వివిధ వర్గాల నాయకులు, ప్రజాప్రతినిధులు జయంతి వేడుకలకు సంబందించి తమ సూచనలు ,సిఫార్సులను అందించారు. ఈసందర్భంగా కన్న డ సాంస్కృతిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.నాగరాజు జిల్లాస్థాయి శాఖల అధికారులు ,సంఘనాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గ్యారెంటీలతో దళితులకు మోసం : గాలి



ఎస్సీ సంఘాల నాయకులతో ఎమ్మెల్యే గాలి జనార్దనరెడ్డి

గంగావతి రూరల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): గ్యారెంటీ హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం దళితులను మోసం చేస్తోందని గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్ధనరెడ్డి మండిపడ్డారు. శనివారం కొప్పళ డీసీ కార్యాలయం ముందు ఎస్టీ, ఎస్సీకుల సంఘాల ఆధ్వర్యంలో భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు. అశోక్ సర్కిల్ నుంచి డీసీ కార్యాలయం వరకు భారీ ఎత్తున పాదయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా జనార్దనరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీఎస్టీకులాల వారికి కేటాయించిన నిధులను గ్యారెంటీలకు మళ్లిస్తోందన్నారు. నిధుల లేక పోవడంతో ఆ సమాజం అభివృద్ధికి దూరమవు తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఎస్సీ ఎస్టీ కులాల నుండి నిధులను తిరిగి జమ చేయాలన్నారు. ఈసందర్భంగా కొప్పళ బీజేపీ జిల్లాధ్యక్షుడు బసవరాజ్, గంగావతి మాజీ ఎమ్మెల్యే పరన్న మునవల్లి, ఎస్సీఎస్టీ కులాలు వారు పాల్గొన్నారు.

వైభవంగా రామలింగేశ్వరస్వామి రథోత్సవం



రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న స్వామీజీ

సిరుగుప్ప, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : రామలింగేశ్వరస్వామి మహా రథోత్సవం శనివారం వైభవంగా జరిగింది. తాలుకాలోని అలబనూరు గ్రామం లో జరిగిన రథోత్సవంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. భక్తులు పూలు, పండ్లు విసిరి మొక్కుబడులు తీర్చుకున్నారు.

వారంలో రెండు వేలకు పైగా కోళ్ల మృతి

● బర్డ్‌ఫ్లూ భయంతో స్థానికుల్లో ఆందోళన



కురేకుప్పలో నాటు కోళ్లు (ఫైల్)

బళ్లారి సిటీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సండూరు తాలూకాలోని కురేకుప్ప ప్రాంతంలో వారం రోజుల వ్యవధిలో 2,400కు పైగా కోళ్లు బర్డ్ ఫ్లూతో మృత్యువాత పడ్డాయి. దీంతో సెంపకం దారుల్లో ఆందోళన నెలకొంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి ఈ వ్యాధి వ్యాపిస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. ప్రారంభంలో ప్రతిరోజు 20నుంచి 30 కోళ్ళు చనిపోయేవి, కానీ తరువాత ప్రతిరోజు 100 నుంచి 200 కోళ్ళు చనిపోయాయి. కోళ్ల మృతికి బర్డ్ ఫ్లూనే కారణమని వైద్యులు నిర్ధారించారు. తర్వాత 1,020 కోళ్ళను వధించారు. ఈ ఇన్ఫెక్షన్ వ్యాప్తి చెందకుండా అన్ని చర్యలు తీసుకున్నామని పశుసంవర్ధక , పశువైద్య సేవల శాఖ డిప్యూటీ డైరెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు.

'హస్తసాముద్రిక' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని అవిష్కరిస్తున్న సచ్చిదానంద సరస్వతి స్వాములు

బళ్లారి సిటీ,మార్చి 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని కల్యాణస్వామి మఠంలో శనివారం గురుప్రసాద్ రచించిన సమస్త హస్త సాముద్రిక శాస్త్రాన్ని చిక్కమంగళూరు ఆది శంకరాచార్య పీఠాధ్యక్షుడు పరమపవిత్ర శ్రీమాన్ జగద్గురు శంకరాచార్య శ్రీ స్వయం ప్రకాశ్ సచ్చిదానంద సరస్వతి మహాస్వామి అవిష్కరించారు. ఈకార్యక్రమంలో బళ్లారి నగర మాజీ ఎమ్మెల్యే గాలిసోమశేఖర్‌రెడ్డి, కార్పోరేటర్లు మల్లనగౌడ, అశోక్, మంజునాథ్, చంద్రమౌళి, శ్రీధర్ పాల్గొన్నారు.

హోసూరు జోన్

క్రీడా పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

హోసూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లాలో వెనుకబడిన వర్గాల శాఖ, మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 35 స్కూల్ హాస్టళ్లు, 12 కళాశాల హాస్టళ్లు సహా మొత్తం 47 హాస్టళ్లు పనిచేస్తున్నాయి. హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థుల కోసం క్రీడా పోటీలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ నేతృత్వంలో జల్లా వెనుకబడిన, మైనారిటీ సంక్షేమ అధికారి, జిల్లా యువజన సంక్షేమ అధికారి, ప్రభుత్వ కళాశాల ప్రొఫెసర్‌లతో కూడిన ఎంపిక కమిటీ సభ్యుల పర్యవేక్షణలో జిల్లా క్రీడా స్టేడియంలో పోటీలు సాగాయి. పరుగు పందెం, లాంగ్ జంప్, వ్యాసరచన పోటీలలో గెలుపొందిన 60 మంది విద్యార్థులకు ప్రశంసాపత్రం, షీల్డ్‌లు అందదచేశారు. ప్రతి పోటీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతి షీల్డ్‌లు, పతకాలు, ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. మైనా ర్టీ సంక్షేమ శాఖ అధికారిణి పద్మలత, హాస్టల్ కీపర్లు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలు అందచేస్తున్న కలెక్టర్ దినేశ్ కుమార్

ఘనంగా సీఎం స్టాలిన్ జన్మదిన వేడుకలు



ప్రతిజ్ఞ చేస్తున్న కార్యకర్తలు

హోసూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ పుట్టినరోజును హోసూరు నగరంలో శనివారం ఘనంగా నిర్వహించారు. డీఎంకే పార్టీ మునిసిపల్ విభాగం ఆధ్వర్యంలో నగర పాలక సంస్థ మాజీ అధ్యక్షుడు గురస్వామి నేతృత్వంలో అణ్ణా విగ్రహం దగ్గర డీఎంకే జెండాను ఎగురవేశారు. అణ్ణా విగ్రహానికి డిప్యూటీ మేయర్ ఆనందయ్య, డిప్యూటీ సెక్రటరీ గోపాలకృష్ణన్, రవికుమార్, డివిజన్ కార్యదర్శులు తిమ్మరాజు, వెంకటేశ్, త్యాగరాజు తదితరులు పూల మాల వేసి నివాళులర్పించారు. అందరికీ మిఠాయిలు పంచి ప్రతిజ్ఞ చేయించారు. తమిళనాడు ప్రయోజనాలను, భవిష్యత్తును ఎవరి కోసమో వదిలిపెట్టమని, రాష్ట్ర హక్కులకోసం కలిసి పోరాడుదాం అని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య స్థాయి సమితి చైర్మన్ మాదేశ్వరన్, పన్నుల సమితి చైర్మెన్ రవి, టీమ్ ఆర్గనైజర్లు ప్రకాశ్, కన్నన్, ఇక్రం అహ్మద్, మునిరాజు, మాజీ కౌన్సిలర్లు రాధా వెంకటస్వామి, నిర్వాహకులు ఆగ్రో నాగరాజు, ధ నలక్ష్మి, రాజా, శాంతి, నిసార్, మురుగేశ్, అళగేశన్, శక్తివేల్‌తో పాటు పలువురు డీఎంకే ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయస్...

కున్నకుడి వైద్యనాథన్ (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత, శాస్త్రీయ సంగీత విద్వాంసులు కున్నకుడి వైద్యనాథన్ 1935 మార్చి 2న తమిళనాడు రాష్ట్రం శివగంగ జిల్లా కుంద్రకుడి గ్రామంలో జన్మించారు. అసలు పేరు వైద్యనాథన్ రామస్వామి శాస్త్రి. చిన్నతనం నుంచే నాదస్వర విద్వాంసులతో కలసి ప్రదర్శనలు ఇచ్చారు. వయోలిన్‌లో సరికొత్త పద్ధతులు ఆవిష్కరించారు. డోలు విద్వాంసులు వాలయపట్టి ఏఆర్ సుబ్రమణియన్‌తో కలసి 3వేలకు పైగా కచేరీలు ఇచ్చారు. తమిళంలో భక్తిపాటలకు ఎనలేని సేవలందించారు. కలైమామణి, సంగీత నాటక అకాడమీ, కర్ణాటక ఇసై జ్ఞాని, సంగీత కళాశిఖామణి తదితర పురస్కా రాలు పొందారు. కొన్ని తమిళ సినిమాలలో అతిథి పాత్రలలో నటించారు. 'రాగ రీసెర్చ్ సెంటర్'కు అధ్యక్షుడిగా వ్యవహరించారు. 2008 సెప్టెంబరు 8న కన్నుమూశారు.

సరోజినీ నాయుడు (వర్ధంతి)



'నైటింగేల్ ఆఫ్ ఇండియా'గా పేరొందిన సరోజినీ నాయుడు 1879 ఫిబ్రవరి 13న హైదరాబాద్‌లో జన్మించారు. కవయిత్రిగా మహాత్మాగాంధీచే 'భారత కోకిల' గా పిలవబడ్డారు. కాగా బాల సాహిత్యంతోపాటు దేశభక్తి, రొమాన్స్, ట్రాజెడీ తదితర అన్ని రకాల కవితలను రచించారు. స్వాతంత్రోద్యమంలోనూ కీలకంగా వ్యవహరించారు. డాక్టర్ గోవిందరాజులు నాయుడుతో వివాహం జరిగింది. సివిల్ రైట్స్ మహిళా సమస్యలపై గళమెత్తారు. 1925లో జాతీయ కాంగ్రెస్ మహాసభలకు అధ్యక్షురాలిగా వ్యవహరించారు. స్వతంత్ర భారత దేశపు తొలి మహిళా గవర్నర్ కావడం విశేషం. 1949 మార్చి 2న కన్నుమూశారు.

ఆనంద్‌జీ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత కల్యాణ్‌జీ-ఆనంద్‌జీ సోదర ద్వయంలో ఆనంద్‌జీ 1933 మార్చి 2న గుజరాత్ రాష్ట్రం కచ్‌లో జన్మించారు. పూర్తి పేరు ఆనంద్‌జీ విర్జి షా. హిందీ సినీ సంగీత రంగంలో తమదైన ముద్రను చాటారు. 1956-1994 మధ్యన 250కుపైగా సినిమాలకు సంగీతం అందించగా 17 గోల్డెన్‌జుబ్లీ, 39 సిల్వర్ జుబ్లీ సాధించాయి. హీరో కిశోర్‌కుమార్‌కు 270కుపైగా పాటలకు సంగీతం అందించారు. దేశ విదేశాలలో పలు స్వచ్ఛంద సంస్థలకోసం ఛారిటీ కార్యక్రమాలకు సంగీత కచేరీ నిర్వహించారు. సరస్వతీ చంద్ర సినిమాకు 1968లో తొలి జాతీయ పురస్కారం అందుకున్నారు. కాగా 2000లో కల్యాణ్‌జీ కన్నుమూశారు. పలు పురస్కారాలు అందుకున్నారు.

'టైగర్' ష్రాఫ్ (పుట్టినరోజు)



ప్రముఖ హిందీ నటుడు 'టైగర్' ష్రాఫ్ 1990 మార్చి 2న ముంబైలో జన్మించారు. అసలు పేరు జై హేమంత్ ష్రాఫ్. బాలీవుడ్ హీరో జాకీష్రాఫ్, నిర్మాత అయేషాదత్‌ల కుమారుడు. 2014లో 'హీరోపంతి' సినిమాతో అడుగుపెట్టారు. 2016లో 'బాఘీ'తో కమర్షియల్ హిట్ సాధించారు. సీక్వెల్‌గా బాఘీ-2గా తీశారు. 2019లో 'వార్'తో ఇండియాలో రూ.300కోట్ల క్లబ్ జాబితాలోకి చేరారు. గ్లోబల్‌గా రూ.475కోట్లు వసూలైంది. కాగా టేక్వాండోలో బ్లాక్ బెల్ట్‌లో హానరరీ ఫిఫ్త్ డిగ్రీ పొందారు. నటుడిగా, డ్యాన్సర్‌గా, మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ ప్రమోటర్‌గా రాణిస్తున్నారు. ఐఐఎఫ్ఏ అవార్డు, 2023లో స్టైలిష్ యాక్షన్ స్టార్ అవార్డు, ఇతర పురస్కారాలు అందుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

కదిరి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పెళ్లి అయిన నెల రోజులకే రోడ్డు ప్రమాదం ఓ యువకుడిని బలిగొంది. ద్విచక్ర వాహనంలో వెళుతుండగా బస్సు ఢీకొనడంతో యువకుడు మృతి చెందగా.. ఇంటర్ విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. కదిరి మున్సిపాలిటి కుటాగుళ్లలోని పులివెందుల క్రాస్ వద్ద శనివారం ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో మోటార్ సైకిల్‌లో వెళుతున్న దాదాపీర్(26) అక్కడికక్కడే మృతి చెందగా.. ఇంటర్ విద్యార్థి సయ్యద్ బాషాకు తీవ్ర గాయాలయ్యాయి. కదిరి అడపాల వీధికి చెందిన దాదాపీర్ మడకశిర తపాలా కార్యాలయంలో పనిచేస్తున్నాడు. వరుసకు తమ్ముడైన నిజాంవలీ కాలనీకి చెందిన సయ్యద్ బాషా అనే ఇంటర్ విద్యార్థి స్థానిక బ్లూమూన్ కళాశాలలో పరీక్ష రాస్తున్నాడు. పరీక్ష అనంతరం కళాశాల నుంచి మోటార్ సైకిల్‌పై కదిరికి వస్తున్నారు. ఇదే సమయంలో కదిరి నుంచి ప్రొద్దుటూరుకు వెళుతున్న ఆర్టీసీ బస్సు కుటాగుళ్లలోని పులివెందుల క్రాస్ వద్దకు రాగానే మోటర్ సైకిల్‌ను ఢీకొంది. దీంతో మోటార్‌సైకిల్ నడుపుతున్న దాదాపీర్ అక్కడిక్కడే మరణించగా సయ్యద్ బాషా తీవ్రంగా గాయపడ్డాడు. విద్యార్థిని 108 ద్వారా ప్రభుత్వ కదిరి ఆసుపత్రికి చేర్చారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

పెళ్లైన నెల రోజులకే..

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దాదాపీర్ పోస్టల్ ఉద్యోగి. మడకశిరలో పనిచేస్తున్నాడు. పెళ్లై దాదాపు 40 రోజులయింది. దాదాపీర్ తల్లి, ఇంటర్ విద్యార్థి సయ్యద్ తల్లి అక్క, చెల్లెళ్లు. వరుసకు తమ్ముడైన సయ్యద్‌బాషా ఇంటర్ మొదటి రోజు పరీక్షకు బ్లూమూన్ కళాశాలకు వెళ్లాడు. పరీక్ష రాసిన సయ్యద్‌ను పిలుచుకు వస్తుండగా.. కుటాగుళ్ల వద్దకు జరిగిన ప్రమాదంలో దాదాపీర్ అక్కడిక్కడే మృతి చెందాడు. దాదాపీర్ మరణ వార్త తెలియగానే అతడి భార్య, తల్లి ఇతర బంధువులు ఆసుపత్రికి చేరుకున్నారు. శవాన్ని చూసి కన్నీరు, మున్నీరయ్యారు. పెళ్లైన నెలకే భర్త మరణించడంతో ఆమె రోదనలు ఆసుపత్రిలో మిన్నంటాయి. చేతికొచ్చిన కొడుకు ఉన్నట్టుండి చనిపోవడంతో విలపించిన తల్లిదండ్రులను చూసి బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.



దాదాపీర్(ఫైల్)

సమాజసేవతోనే సార్థకత

● పురసభ మాజీ అధ్యక్షుడు చంద్రారెడ్డి

బంగారపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మనిషి మరణించిన తర్వాత కూడా వారి పేరు అజరామరంగా ఉండడానికి వారు చేసే సమాజసేవయే కారణమని అటువంటివారి బాటలో నలుగురు ఉపాధ్యాయుల సాధన ఎంతో కీలకంగా ఉందని పురసభ మాజీ అధ్యక్షుడు కే చంద్రారెడ్డి అభిప్రాయపడ్డారు. పట్టణంలోని ఏవీకే కల్యాణమండపంలో ఉపాధ్యాయుల మిత్ర బృందం బంగారపేట, కేజీఎఫ్ తాలూకా, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నలుగురు ఉపాధ్యాయుల జ్ఞాపకార్థం శనివారం ఏర్పాటైన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు, ఉపాధ్యాయుడు సీ చంద్రశేఖరగౌడ, మరో ముగ్గురుఉపాధ్యాయులు ఏ పని అయినా కలసికట్టుగా చేసేవారన్నారు. చివరకు ఒక ప్రమాదంలో నలుగురు మృతి చెందారన్నారు. 11 ఏళ్లు గడిచినా ఉపాధ్యాయుల సేవను గుర్తించి వారి జ్ఞాపకార్థం సమాజసేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రక్తదానం చేయడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న మరొకరి ప్రాణాలు కాపాడినవారు అవుతారన్నారు. సమాజంలో విద్యతోనే మార్పు సాధ్యమని అందుకు ఉపాధ్యాయుల చొరవ అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సీ అప్ప య్యగౌడ మాట్లాడుతూ సమాజంలో ఎవరు మంచి పనిచేసినా వారిని గుర్తిం చాలన్నారు. అందుకే 11ఏళ్లు గడిచినా ఉపాధ్యాయుడడు చంద్రశేఖరగౌడ, వారి మిత్రుల జ్ఞాపకార్థం సమాజసేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నా మన్నారు. ఇదే సందర్భంగా రక్తదాతలకు ప్రశంసాపత్రం, ఒక మొక్కను అందచేశారు. కార్యక్రమంలో తాలూకా కసపా అధ్యక్షుడు ఆర్ అశ్వథ్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఉమేశ్, కుంబారసంఘం అధ్యక్షుడు కుంబారపాళ్య మంజునాథ్, ఎల్ రామకృష్ణ, శ్యాం మూర్తి తదితరులు పాల్గొన్నారు.



రక్తదాతలకు ప్రశంసాపత్రం, మొక్క అందజేత

తళగవార పంచాయతీ ఉపాధ్యక్షుడిగా సంపత్‌కుమార్

చింతామణి రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కైవార హోబళి తళగవార గ్రామపంచాయతీ ఉపాధ్యక్షస్థానానికి శనివారం జరిగిన ఎన్నికల్లో జేడీఎస్ మద్దతుదారుడు సంతప్‌కుమార్ ఎస్ ఎన్నికయ్యారు. ఇదివరకు ఉపాధ్యక్షులుగా వ్యవహరించిన రమేశ్‌స్వామి పలు కారణాలతో రాజీనామా చేయడంతో ఖాళీ అయిన స్థానానికి ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అధికారిగా అమరనారాయణరెడ్డి వ్యవహరించారు. ఉపాధ్యక్ష స్థానానికి జేడీఎస్ మద్దతుదారుడు సంపత్‌కుమార్, కాంగ్రెస్ మద్దతుదారుడు రమేశ్‌స్వామి నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తం 19మంది సభ్యులు ఉండగా 18మంది హాజరు కాగా ఒకరు గైర్హాజరయ్యారు. సంపత్‌కుమార్‌కు 9 ఓట్లు, రమేశ్‌స్వామికి 8 ఓట్లు రాగా ఒక ఓటు ఆధిక్యంతో సంపత్‌కుమార్ గెలుపొందినట్టు ప్రకటించారు. నూతన ఉపాధ్యక్షుడిని గ్రామపంచాయతీ అధ్యక్షురాలు సమీనా సుల్తాన, సభ్యులు వెంకటేశ్, పార్వతమ్మ, నరసింహమూర్తి, అనిల్‌కుమార్, రవికుమార్, నారాయణస్వామి తదితరులు అభినందించారు.



నూతన ఉపాధ్యక్షుడికి ఆత్మీయ సత్కారం

మౌలిక సదుపాయాల పెంపే లక్ష్యం



భూమిపూజలో ఎమ్మెల్యే మంజుళా లింబావళి

మహదేవపుర, మార్చి 1(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని బెళ్లందూరు, వర్తూరు వార్డుల పరిధిలోని పలు ప్రాంతాలలో మౌలిక సదుపాయాలను పెంచనున్నట్టు ఎమ్మెల్యే మంజుళా లింబావళి తెలిపారు. కైకొండ్రహళ్లి కాలనీ, జున్నసంద్ర, కోదండ రామనగర, చిక్కనాయకనహళ్లి, దొడ్డకన్నళ్లి, చిక్క బెళ్ళందూరు, గుంజూరుపాళ్య, హలంజూరు కాలనీ, బళగెరె సర్కిల్, అంబేడ్కర్ విగ్రహం సమీపాన, మధురానగర్ ప్రాంతాలో విద్యుత్‌దీపాల అమరిక, డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ బీజేపీ హోబళి పట్టణ అధ్యక్షుడు ఎన్ఆర్ శ్రీధర్‌రెడ్డి, తాజా మాజీ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర పరిషత్ సభ్యుడు ఎల్ రాజేశ్, మాజీ కార్పొరేటర్ పుష్పమంజునాథ్, మహేంద్రమోది, శ్రీధర్, చిక్కణ్ణ తదితరులు పాల్గొన్నారు.

దైవారాధనతో మానసిక ప్రశాంతత

ముళబాగిలు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నిత్యం దైవారాధన ద్వారా మానసిక ప్రశాంతత సాధ్యమని ఉడుపి పెజావర మఠాధిపతి, శ్రీరామ జన్మభూమి తీర్థ ట్రస్టు సభ్యుడు విశ్వప్రసన్న తీర్థ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని కదరీపుర గ్రామంలోని పురాణ ప్రసిద్ధమైన కంబద లక్ష్మీనారాయణస్వామి ఆలయాన్ని శనివారం సందర్శించారు. స్వామివార్లకు పూజలు చేసిన అనంతరం ఆలయ చరిత్ర గురించి ప్రధాన అర్చకులు ఎంజీ బిందుమాధవరావ్ నుంచి తెలుసుకున్నారు. ఆలయంలోని 64 అడుగుల ఏకశిలా ధ్వజస్తంభాన్ని వీక్షించారు. అనంతరం ఆలయ ఆవరణలోని గోశాలను వీక్షించి ప్రశంసించారు. ఈ సందర్భంగా విశ్వప్రసన్నతీర్థ మాట్లాడుతూ ఆధ్యాత్మికత ద్వారా ఉత్తమ జీవనం సాధ్యమని అభిప్రాయపడ్డారు. పురాణ ప్రసిద్ధ ఆలయాన్ని సందర్శించడం సంతోషంగా ఉందన్నారు.



విశేష పూజల్లో విశ్వప్రసన్నతీర్థ

బెంగళూరు అభివృద్ధి జరుగుతోంది

» డీకే శివకుమార్ భేటీ అనంతరం మోహన్‌దాస్‌పై



డీసీఎం డీకే శివకుమార్‌తో మోహన్‌దాస్‌పై

బెంగళూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరంలో అభివృద్ధిపై తరచూ విమర్శలు చేసే పారిశ్రామికవేత్త మోహన్‌దాస్‌పై ఒక్కసారిగా మాట మార్చారు. శనివారం డీసీఎం డీకే శివకుమార్‌ను ఆయన నివాసంలో కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ డీకే శివకుమార్ మంచి ఆలోచన కల్గిన మంత్రి అని, నగరంలో ఫుట్‌పాత్, రోడ్లు, మెట్రో అభివృద్ధిపై చర్చలు జరిపానన్నారు. మరో ఆరు నెలల్లో అభివృద్ధి చూపుతామని డీకే శివకుమార్ తెలిపారన్నారు. దేశంలో ఏ నగరంలోనూ అభివృద్ధి విషయంలో పారిశ్రామికవేత్తల సలహాలు తీసుకోవడం లేదని, ఇక్కడ ఆహ్వానించి అభిప్రాయాలు సేకరిస్తున్నారన్నారు. ఇంతటి సామరస్యమైన నగరం ఎక్కడా లేదన్నారు. కన్నడిగులకు మంచి జరగాలని బెంగళూరు అభివృద్ధి కావాలన్నారు. బీజేపీ ప్రభుత్వంలోనూ అవినీతిపై మాట్లాడానని, నాకు ప్రభుత్వం ఏదైనా ఒక్కటే అన్నారు. బెంగళూరు నగరానికి సంబంధించి అందరు ముఖ్యమంత్రులు నా అభిప్రాయాలు కోరారన్నారు. అంతర్జాతీయ నగరంగా బెంగళూరు తీరుతున్న తరుణంలో డీసీఎంతో చర్చలు జరిపానన్నారు. రెండు రోజులక్రిందటే భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ మాట్లాడుతూ మోహన్‌దాస్‌పై విమర్శలు మాని సలహాలు ఇవ్వాలని, కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఏ చేసినా సమంజసం అనే ధోరణి పోవాలన్నారు.

సురక్షిత ప్రయాణం ముఖ్యం

బెంగళూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రయాణంలో సురక్షితం ముఖ్యమని రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి అభి ప్రాయపడ్డారు. రోడ్డు భద్రతా అవ గాహనపై రవాణాశాఖ, నగర పోలీసు సంయుక్తంగా శనివారం కంఠీరవ స్టేడి యంలో సేఫ్‌థాన్ 2025 పేరిట వాకథాన్ నిర్వహించింది. 12వేల మందికిపైగా ఔత్సాహికులు వాక థాన్‌లో పాల్గొన్నారు. అంతర్జాతీయ అథ్లెటిక్ అర్జున్ దేవయ్య మాట్లాడుతూ మొబైల్ ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడపడం పెను ప్రమాదానికి కారణం అవుతోందన్నారు. నగర పోలీస్ కమిషనర్ దయానంద్, నటుడు విజయ రాఘవేంద్రతోపాటు పలువురు పాల్గొన్నారు.



వాకథాన్‌లో పాల్గొన్న ప్రజలు

వేతనాలు పెంచాలి

మధ్యాహ్న భోజన సిబ్బంది డిమాండ్



బీఈఓకు వినతి పత్రం అందజేత

బాగేపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సమర్పించే బడ్జెట్‌లో వేతనాలు పెంచాలని కోరుతూ మధ్యాహ్న భోజన సిబ్బంది డిమాండ్ చేశారు. ఈనెల 4, 5 తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక ధర్నా చేపట్టదలిచినట్టు అక్షర దాసోహ ఉద్యోగులసంఘం బాగేపల్లి తాలూకా సమితి అధ్యక్షుడు ముస్తఫా తెలిపారు. శనివారం పట్టణంలోని బీఈఓ వెంకటేశప్పకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అక్షరదాసోహ ఉద్యోగులు తమ బహిష్కరించి ఈనెల 4, 5 తేదీలలో బెంగళూరులో పోరాటం చేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా అక్షరదాసోహ ఉద్యోగుల సంఘం తాలూకా సమితి సభ్యులు, పదాధి కారులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల్లో తహసీల్దార్ తనిఖీ

ముళబాగిలు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ముళబాగిలు పట్టణంలోని బాలుర, బాలికల పీయూ కళాశాలల్లో ద్వితీయ పరీక్షలు శనివారం ప్రారంభమైన నేపథ్యంలో తహశీల్దార్ వీ గీతా స్వయంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ తాలూకాలోని తాయలూరు ప్రభుత్వ కళాశాల, పట్టణ శివారులోని ఎస్‌డీసీ కాలేజ్, శారదా మహిళా కళాశాల, ప్రభుత్వ బాలుర, బాలికల కళాశాలలు మొత్తం 5 కళాశాలల్లో ద్వితీయ పీయూ పరీక్షలు జరుగుతున్నాయన్నారు. తొలిరోజు కన్నడ సబ్జెక్టు పరీక్ష జరుగుతోందన్నారు. పరీక్షా కేంద్రాలలో ప్రథమ చికిత్సలకు అత్యవసరం కోసం నర్సు, ఆశా కార్యకర్తలను అందుబాటులో ఉంచామన్నారు. తాగునీరు, శౌచాలయ వ్యవస్థ ఉందన్నారు. కాపీయింగ్‌కు అవకాశం లేకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు.



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు



ప్రభుత్వ కళాశాలలో తహసీల్దార్ గీత తదితరులు

ప్రశాంతంగా పీయూసీ పరీక్షలు

విజయపుర: ద్వితీయ పీయూ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వ పీయూ కళాశాల, ప్రగతి బాలికల కంపోజిట్ పీయూ కళాశాలల్లో పరీక్షలు రాశారు. ప్రభుత్వ పీయూ కళాశాలలో 252 మందికిగాను ఒకరు గైర్హాజరయ్యారు. ప్రగతి కళాశాల పరీక్షా కేంద్రంలో 327మందికిగాను 19మంది గైర్హాజరయ్యారు. తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా సాగాయి.

అందరి అభిమానం పొందడమే ముఖ్యం

శిడ్లఘట్ట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ప్రజల అందరి అభిమానం పొందడమే ముఖ్యమని శిడ్లఘట్ట తాలూకా బీజేపీ రూరల్ హోబళి అధ్యక్షుడు సీకల్ ఆనందగౌడ అభిప్రాయపడ్డారు. శిడ్లఘట్ట పట్టణంలోని ఆశాకిరణ అంధ విద్యార్థుల పాఠశాలలో విద్యార్థులతో కలసి పుట్టినరోజును సరళంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవలి కాలంలో పుట్టినరోజున జల్సాలు చేయడం, స్టార్ హోటళ్లలో పార్టీలు చేసుకోవడం సామాన్యమని అయితే అంధ పాఠశాల విద్యార్థుల నడుమ గడపడం సంతోషంగా ఉందన్నారు. పాఠశాలలో కేక్ కట్ చేసి అనంతరం వారితో కలసి భోజనం చేశారు. అంతకుముందు పట్టణంలోని మయూర సర్కిల్‌లోగల బీజేపీ సేవాసౌధలోనూ కార్యకర్తలతో కలసి కేక్ కట్ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఇదే తొలిసారి బీజేపీ ప్రముఖులంతా కలసి అంధ విద్యార్థులతో కలసి గడపడం చాలా సంతోషంగా ఉందన్నారు. తన తుదిశ్వాస వరకు నియోజకవర్గ ప్రజలకే కేటాయిస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ రూరల్ హోబళి మాజీ అధ్యక్షుడు సురేంద్రగౌడ, డాక్టర్ సత్యనారాయణరావ్, మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్మద రెడ్డి, పట్టణ విభాగం అధ్యక్షుడు నరేశ్, తాలూకా మహిళా విభాగం అధ్యక్షురాలు చాతుర్య తదితరులు పాల్గొన్నారు.

సజావుగా విద్యుత్ సరఫరా చేయండి



బెస్కాం అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

బాగేపల్లి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): వేసవి సమీపిస్తున్న తరుణంలో విద్యుత్ సరఫరా సమగ్రంగా లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నట్టు జిల్లా అఖిల కర్ణాటక సంఘం ఆధ్వర్యంలో తాలూకా బెస్కాం కార్యాలయం ముందు శనివారం ధర్నా చేపట్టారు. వందలాదిమంది రైతులు నిరసనలో పాల్గొన్నారు. సంఘం జిల్లా సంచాలకులు పీ మంజునాథరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ పంప్‌సెట్‌లకు త్రీఫేజ్ విద్యుత్ సమగ్రంగా సరఫరా కావడం లేదన్నారు. 7గంటల త్రీఫేజ్ ఇస్తున్నామని నాయకులు చెబుతున్నా అమలు కావడం లేదన్నారు. విద్యుత్ కోత కారణంగా పంటల దిగుబడి తగ్గి నష్టపోతున్నామని విచారం వ్యక్తం చేశారు. విద్యార్థులకు మరోవైపు పరీక్షలు ప్రారంభం అవుతున్నాయని, విద్యుత్‌కోత లేకుండా సరఫరా చేయాలని కోరారు. నిరసనలో రైతుసంఘం ప్రముఖులు హేమచంద్ర, శ్రీరామప్ప, శ్రీనివాస నాయక్, మంజునాథ మిట్టేమరి, మహ్మద్ అక్రం, నరసింహారెడ్డి, మద్దిరెడ్డి, అశ్వథరెడ్డి, వెంకటరామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను ప్రోత్సహించాలి



వేదికపై ఎమ్మెల్యే గోపాలయ్య తదితరులు

జాలహళ్ళి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పిల్లల్లో దాగియున్న ప్రతిభను ప్రోత్సహించేందుకు పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమాలు దోహదపడతాయని మహాలక్ష్మి లే అవుట్ ఎమ్మెల్యే గోపాలయ్య అభిప్రాయపడ్డారు. నందిని లే అవుట్‌లోని శాన్స్ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవం సిరి కిడ్స్ ఫెస్ట్ 2025 పేరిట సుమనహళ్ళిలోని బాబు జగ్జీవన్‌రాం సభాంగణంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోపాలయ్య మాట్లాడుతూ పిల్లల్లో సంస్కారం, నైతిక విలువలు నేర్పే బాధ్యత ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులపై కూడా ఉందన్నారు. పాఠశాల ముఖ్యులు శ్రీకంఠప్ప మాట్లాడుతూ అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని పెంపొందించడం, ఉత్తమ పౌరులుగా తీర్చే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఇందుకు తల్లిదండ్రుల సహకారం కూడా ఎంతో అవసరమన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో డాక్టర్ ఆంజినప్ప, కాంగ్రెస్ ముఖ్యులు కేశవమూర్తి, బీజేపీ ముఖ్యులు వెంకటేశ్‌మూర్తి, ఎస్ అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం

రాయచూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా శనివారం పీయూసీ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమైయ్యాయి. పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులకు నగరంలోని ఎస్ఆర్‌పీఎస్ కళాశాల వద్ద ఆత్మీయ స్వాగతం లభించింది. కళాశాల పాలక మండలి చైర్మన్ శ్రీరామ్ బూబ్ , ప్రిన్సిపాల్ రాఘమ్మ, వీరేశ్ సెరెగ్రలతో పాటు అధ్యాపకులు విద్యార్థులకు గులాబి పుష్పాలు ఇచ్చి స్వాగతం పలికారు. ఆందోళన లేకుండా ప్రశాంత చిత్తంతో రాయాలని వారికి శుభాకాంక్షలు తెలిపారు.



విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలుకుతున్న అధ్యాపకులు

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో రైతు మృతి



గొల్ల శివప్ప (ఫైల్)

గోరంట్ల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూచేపల్లిలో గొల్ల శివప్ప (38) అనే రైతు బోరుబావి వద్ద విద్యుదాఘాతానికి గురై శనివారం మృతి చెందాడు. శివప్ప స్వగ్రామం చిలమత్తూరు మండలం మొరంపల్లి. శివప్ప తల్లి పుట్టినిల్లు బూచేపల్లి కావడంతో చిన్నప్పటి నుంచి మేనమామలు నిజమాయలప్ప, రమణ వద్ద ఉంటున్నాడు. ముదిగుబ్బ మండలానికి చెందిన రేణుకతో పదేళ్ల క్రితం వివాహమయింది. వీరికి సంతానం లేరు. ఒక్కటిన్నర ఎకరా పొలంలో బోరువేసుకొని దంపతులు ఇద్దరూ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వేరుశనగ సాగు చేయాలని భూమిని దుక్కి చేశాడు. విద్యుత్ స్తంభం వద్ద ఉన్న స్టాటర్ నుంచి సర్వీసు వైరు నేలపై ఉండటంతో కట్టెలపై అమర్చే ప్రయత్నం చేస్తుండగా వైరు తాకడంతో విద్యుత్ షాక్‌కి గురై అక్కడికక్కడే మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. సీఐ శేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు.

యువకుడి దారుణహత్య

● పాతకక్షలా..? వివాహేతర సంబంధమా..?



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న రూరల్ ఎస్ఐ లింగన్న

పుట్టపర్తి రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంగళమ్మచెరువు గ్రామానికి చెందిన కొత్తకోట నాగేష్ (34) అనే యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. స్థానికులు, బంధువులు తెలిపిన మేరకు.. వెంగళమ్మచెరువుకు చెంది న నాగేష్‌ను శుక్రవారం రాత్రి ఎవరో ద్విచక్రవాహనంలో ఎక్కించుకు వెళ్లారు. బయటకు వెళ్లిన వ్యక్తి ఇం టికి రాకపోవడంతో అనుమానంతో కుటుంబసభ్యులు శనివారం ఉదయం రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి ఆచూకీ కో సం బంధువులు పోలీసులు గాలిం పు చర్యలు చేపడుతుండగా.. శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో అమగొండపాల్యెం రోడ్డు సమీపంలోని మామిడితోటలో మృతదేహం ఉండటాన్ని గమనించిన పశువులు కాపరులు బంధువులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్‌టీంను రంగంలోకి దింపి విచారణ చేపట్టారు. మృతుడు నాగేష్‌కు భార్య సునీత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇతడు ట్రాక్టర్ బాడుగలకు తిప్పి జీవనం సాగించేవాడు. 25 ఏళ్ల క్రితం బుక్కపట్నం మండలం కొత్తకోట గ్రామంలో జరిగిన ఓ హత్యకేసుతో వీరి కుటుంబానికి సంబంధం ఉన్నట్లు తెలిసింది. అప్పుడే వీరి కుటుంబం కొత్తకోట గ్రామాన్ని వదిలి వెంగళమ్మచెరువుకు వచ్చి స్థిరపడింది. నాగేష్ హత్యకు పాతకక్షలు ఏమైనా ఉన్నాయా.. లేక వివాహేతర సంబంధం కారణమా అనే కోణాల్లో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

పింఛన్ల పంపిణీలో 'అనంత'కు తృతీయ స్థానం

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో అనంతపురం జిల్లా తృతీయ స్థానంలో నిలిచింది. ఉదయం 7గంటల నుంచే గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగులు ఇళ్లవద్దకే వెళ్లి పంపిణీ ప్రారంభించారు. 2,79,695 మందికి రూ.123.87 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. ఒకేరోజు 2,69,119 మందికి రూ.118.97కోట్లు పంపిణీ చేసి 96.22 శాతంతో తృతీయ స్థానంలో జిల్లాను నిలిపారు. కలెక్టరేట్‌లోని ఎన్ఐసీలో ఏర్పాటు చేసిన జిల్లా కమాండ్ కంట్రోల్ రూం నుంచి డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య నేతృత్వంలోని అధికారులు మానిటరింగ్ చేశారు. ఎక్కడా అంతరాయం లేకుండా సాయంత్రం వరకు పింఛన్లు పంపిణీ చేశారు. కలెక్టర్ వినోద్‌కుమార్ తాడిపత్రి నియోజకవర్గంలో పాల్గొన్నారు. మిగిలిన లబ్ధిదారులకు సోమవారం పంపిణీ చేస్తారు.

797 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శనివారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 797 క్యూసెక్కులు వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 814 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.621 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వెల్లడించారు.

పత్తి రైతు చిత్తు..!

అరకొరగానే దిగుబడులు

పాతాళానికి ధర
నష్టానికి అమ్ముకోలేక ఇళ్లలోనే నిల్వ



గుత్తిలో ఖాళీగా పత్తి కొనుగోలు కేంద్రం

పత్తి రైతులకు ఈసారి కష్టాలు తప్పడం లేదు. సకాలంలో వర్షం పడకపోవడం, తెగుళ్లతో అరకొరగానే దిగుబడి వచ్చింది. ఇదే క్రమంలో బహిరంగ మార్కెట్‌లో ధరలు అమాంతం తగ్గుముఖం పట్టాయి. అరకొర దిగుబడితో నష్టపోయిన రైతులు ధర కూడా తక్కువగా ఉండటంతో మరింత కుదేలవుతున్నారు. ధరలు తక్కువగా ఉండటంతో ఎక్కువమంది ఇళ్లలోనే పత్తి పంటను నిల్వ చేసుకున్నారు. ప్రభుత్వం కనీస మద్దతు ధరతో పత్తిని కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం అర్బన్/పామిడి



పామిడి మండలంలో నిల్వ చేసిన పత్తి దిగుబడి

పడిపోయిన ధర

ఖరీఫ్‌లో పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 48వేల హెక్టార్లుగా నిర్ణయించారు. జిల్లావ్యాప్తంగా 28వేల హెక్టార్లల్లో మాత్రమే పంట పెట్టారు. గత రెండేళ్లతో పోలిస్తే ఈసారి సాగు విస్తీర్ణం తగ్గింది. పెట్టుబడులు పెరగడం, తెగుళ్ల నివారణకు మందుల పిచికారీ కోసం ఎక్కువ డబ్బు ఖర్చు చేయాల్సి రావడం, మార్కెట్‌లో ఆశించిన స్థాయిలో ధర లేకపోవడం తదితర కారణాలతో పత్తి సాగును రైతులు తగ్గించారు. కొందరు తమకున్న పొలంలో సగం పత్తి, మిగతా విస్తీర్ణంలో కంది, కొర్ర, పొగాకు తదితర పంటలు పెట్టారు. ఎకరాకు రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. ఈసారి వర్షాభావ పరిస్థితులతోపాటు గులాబి రంగు తెగులు సోకడంతో పత్తి దిగుబడి తగ్గింది. వర్షా లు సకాలంలో పడితే ఎకరాకు 8 నుంచి 15 క్వింటాళ్లదాకా దిగుబడి వస్తుంది. ఈసారి 4 నుంచి 5 క్వింటాళ్లలోపే వచ్చింది. ధర తక్కువగా ఉండటంతో పత్తి పంటను ఎక్కువమంది రైతులు ఇళ్లలోనే నిల్వ చేసుకున్నారు. ఈసారి పంట సాగు విస్తీర్ణం తగ్గడంతోపాటు, పత్తి దిగుబడి అరకొరగానే వచ్చింది. అయినా ధర పెరగలేదు. కొందరు దళారులు కుమ్మక్కై ధరలు పెరగకుండా చేసి, రైతులను దోపిడీ చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మూడే ళ్ల క్రితం క్వింటా పత్తి రూ.10వేలు పలికింది. రెండేళ్ల క్రితం క్వింటా నా ణ్యతను బట్టి పత్తి రూ.7వేల నుంచి రూ.8వేలదాకా ఉండింది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో పత్తి నాణ్యతను బట్టి క్వింటా ధర రూ.5800 నుంచి రూ.6300 దాకా పలుకుతోంది.

మద్దతు ధరతో కొనుగోలులో నిర్లక్ష్యం

పత్తి రైతుకు మద్దతు ధర కల్పించి కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. ఏటా గుత్తి, తాడిపత్రి మార్కెట్ యార్డుల్లో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తూ వస్తున్నారు. ఈసారి కేవలం గుత్తి మార్కెట్ యార్డులో గతేడాది డిసెంబరు రెండోవారంనుంచి 25 రోజులపాటు తూతూమంత్రంగా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) అధికారులు పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతోనే సరిపెట్టారు. ఈసారి పత్తి క్వింటా మద్దతు ధర రూ.7561గా ప్రభుత్వం నిర్ణయించింది. 3,300 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయడంతోనే సీసీఐ అధికారులు సరిపెట్టారు. ఎక్కువశాతం పత్తి నాణ్యతగా లేదంటూ రైతులను వెనక్కి పంపినట్లు సమాచారం. ఆదోని, నంద్యాల, బళ్లారి మార్కెట్లకు జిల్లాలోని రైతులు పత్తి ఉత్పత్తిని తీసుకెళ్తున్నారు. అక్కడ క్వింటా పత్తి రూ.6500 పలుకుతున్నట్లు సమాచారం. రవాణా ఖర్చులు అదనంగా రైతుపై పడుతున్నాయి.

సాగు తగ్గించాం



ఏటా 30 ఎకరాల్లో పత్తి పంట సాగు చేసేవాళ్లం. రెండేళ్లుగా గిట్టుబాటు ధర దక్కట్లేదు. పంట సాగు, తెగుళ్ల నివారణకు పెట్టుబడి ఖర్చులు పెరిగిపో యాయి. దీంతో ఈసారి ఏడెకరాల్లోనే పంట పెట్టా. ఎకరాకు 4 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. దిగుబడి తగ్గినా గిట్టుబాటు ధర మాత్రం పెరగడం లేదు. దీంతో నష్టపోతున్నాం.

- దేవేంద్రరెడ్డి, రైతు, రామరాజుపల్లి, పామిడి మండలం

ఇంట్లోనే నిల్వ చేసుకున్నాం



బహిరంగ మార్కెట్‌లో ఆశించిన మేర ధర లేకపోవడంతో పత్తి పంటను ఇంట్లోనే నిల్వ చేసుకున్నాం. రెండేళ్లుగా గిట్టుబాటు ధర లేదు. మా గ్రామంలో 2500 క్వింటాళ్ల పత్తిని రైతులు నిల్వ చేసుకున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేసి, రైతులను ఆదుకోవాలి. - రామలింగారెడ్డి, రైతు, గజరాంపల్లి, పామిడి మండలం

క్వింటా రూ.10వేలతో కొనుగోలు చేయాలి



ధరలు తక్కువగా ఉండటంతో రెండేళ్లుగా ఎక్కువమంది రైతులు ఇళ్లలోనే పత్తి దిగుబడులను నిల్వ చేసుకున్నారు. నాణ్యత ప్రమాణాల పేరుతో పత్తి పంటను కొనుగోలు చేయకపోవడం దారుణం. ఈసారి పంట సాగు విస్తీర్ణంతోపాటు దిగుబడి తగ్గినా ధరలు పెరగకుండా దళారులు కుమ్మక్కై రైతులను దోపిడీ చేస్తున్నారు. పత్తి క్వింటా రూ.10వేలతో కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- చంద్రశేఖర్ రెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

న్యాయపాలనతో చారిత్రక గౌరవాన్ని నిలుపుకోవాలి

● హైకోర్టు చీఫ్ జస్టిస్ ఎన్‌వీ అంజారియా

రాయచూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని లింగసుగూరు పట్టణానికి ఈ ప్రాంతానికి చాణుక్యులు, మౌర్య వంశ పాలకుల నుంచి చారిత్రక అనుబంధం ఉందని న్యాయపాలనలో ఆ నాటి వైభవాన్ని అప్పటి చారిత్రక గౌరవాన్ని నిలుపుకునేలా ఇక్కడి న్యాయవాదులు పని చేయాలని రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ ఎన్‌వీ అంజారియా సూచించారు. జిల్లాలోని లింగసుగూరు పట్టణంలో కొత్తగా నిర్మించిన కోర్టు భవనాన్ని చీఫ్ జస్టిస్ శనివారం ప్రారంభించారు. దీంతో పాటు న్యాయవాదుల విశ్రాంతి భవనం, ఈ-సేవా కేంద్రం పనులకు జస్టిస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన చీఫ్ జస్టిస్ న్యాయపాలనలోను ఈ ప్రాంతానికి ఉన్న చారిత్రక విశిష్టతను ప్రతియోక్కరు గుర్తెరగాలన్నారు. ముఖ్యంగా న్యాయవాదులు మరింత మెరుగైన అధ్యాయనం ద్వార కక్షిదారులకు సత్వర న్యాయం అందేలా తగిన జాగ్రతలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న సుప్రీం కోర్టు విశ్రాతం న్యాయమూర్తి జస్టిస్ శివరాజ్ పాటీల్, న్యాయ పోరాటంలో బాధితులకు సత్వర న్యాయం అందించడమే ప్రధాన లక్ష్యంగా నేటి తరం న్యాయవాదులు తమ పని తీరును మెరుగుపర్చుకోవాలని సూచించారు. కక్షిదారుల్లో గెలిచే వారు ఓడే వారు ఇద్దరు ఉంటారని గెలిచిన వారు సంతోషంగా వెళ్లడం సహజమే అయినా ఓడిన వారు సహితం సంతృప్తిగా తిరిగి వెళ్లెలా న్యాయపాలన జరిగేటట్లు న్యాయవాదులు తగిన శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన జిల్లా ఇంచార్జ్ మంత్రి, రాష్ట్ర వైద్యకీయ విద్యశాఖల మంత్రి డాక్టర్ వరణప్రకాశ్ పాటీల్ కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయ వ్యవస్థను మరింత పటిష్టం చేసే దిశగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. డిజిటల్ సౌకర్యాలు, ఈ-పాలన పరమైన అన్ని రకాల వసతులను కల్పించడం ద్వార న్యాయస్తానాల్లో ప్రజలకు మరింత మెరుగైన సేవలు లభించే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.



కోర్టు భవనాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు చీఫ్ జస్టిస్ ఎన్‌వీ అంజారియా

విద్యా వృక్షం అనంతలక్ష్మి

- విశ్రాంత ఐఏఎస్ లక్ష్మీనారాయణ
- సాగునీటి సలహాదారు కన్నయ్య నాయుడు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముఖ్య అతిథులు

అనంతపురం సెంట్రల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కరువు జిల్లాలో అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల సాంకేతిక విద్యా వృక్షంగా వెలుగొందుతోందని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఫౌండర్ డైరెక్టర్, విశ్రాంత ఐఏఎస్ లక్ష్మీనారాయణ, రాష్ట్ర ఇరిగేషన్ విభాగం సలహాదారు కన్నయ్య నాయుడు అన్నారు. నగరంలోని అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల 17వ వార్షికోత్సవంలో వారు పాల్గొని ప్రసంగించారు. కళాశాల ఛైర్మన్ అనంతరాముడు, వైస్ ఛైర్మన్ రమేష్ నాయుడు ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. అనంతపురం జేఎన్టీయూ రిజిస్ట్రార్ క్రిష్ణయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, రైతు కుటుంబం నుంచి వచ్చిన అనంతరాముడు పాఠశాల, కళాశాలను ఏర్పాటు చేయడం హర్షణీయమని అన్నారు. విద్యలో రాశి కాదని, వాసి కూడా కావాలని అన్నారు. విద్యార్థులకు డిగ్రీ ఇచ్చి పంపడం కాదని, నైపుణ్యం పెంచి పంపాలని సూచించారు. లేకుంటే ద్రోహం చేసినవారౌతారని అన్నారు. వరదలు వచ్చినప్పుడు ప్రభుత్వ ఉద్యోగులే అన్ని పనులు చేయలేరని కన్నయ్య నాయుడు అన్నారు. రైతులు సంఘటితమై, ప్రభుత్వం ఇచ్చే నిధులతో కాలువలను బాగుచేసుకోవాలని సూచించారు. రాయలసీమలోని వ్యాసంపల్లి అనే చిన్నగ్రామంలో తాము ఉండేవారమని, తాను రైతు కుటుంబంలో జన్మించానని తెలిపారు. 1952లో కరువు చూశామని, ఆ సమయంలో బతికేందుకు ఒక గ్లాసు అంబలి ఇచ్చేవారని అన్నారు. తమ పెద్దలు చెప్పిన ప్రకారం 1935 నుంచే కరువు తాండవిస్తోందని, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాల నుంచి చాలామంది పొట్ట నింపుకోవడానికి వలస వెళ్లారని గుర్తుచేసుకున్నారు. బెంగళూరు, మద్రాసు వంటి నగరాలకెళ్లి ఇళ్లలో పనిచేసేవారని అన్నారు. ఇంజనీరుగా తన అనుభవాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం క్రీడాపోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ట్రోఫీలు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

నేడు ఉద్యాన శాఖ డైరెక్టర్ పర్యటన

అనంతపురం అర్బన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఉద్యాన శాఖ డైరెక్టర్ దేవమునిరెడ్డి ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఫెయిర్‌ట్రాసా కంపెనీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ పాట్రిక్ స్ట్రూబి, ఉద్యాన శాఖ అధికారులతో కలిసి జిల్లాలో అరటి సాగు, ఎగుమతిపై క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తారు. రాప్తాడు మండలం రామినేపల్లిలో టిష్యూకల్చర్ అరటి ఉత్పత్తిని పరిశీలిస్తారు. పెద్దపప్పూరు మండలం ముచ్చుకోట, పుట్లూరు మండలం సంజీవపురం, కడవకల్లులో అరటిని పరిశీలిస్తారు. తాడిపత్రి మండలం చుక్కలూరులో కోల్డ్ స్టోరేజీని పరిశీలించనున్నారు.

మన్నీల గ్రామ సమీపంలో సాగులో ఉన్న చీనీ, బెండ, దానిమ్మ పంటలు



క రెంటు ట.. ట..!

ఆ గ్రామాల్లో సాగునీరు పుష్కలం. చెరువులు నీటితో నిండుగా ఉన్నాయి. భూగర్భ జలాలకు ఇబ్బంది లేదు. బోర్లలో మునుపటి కంటే ప్రస్తుతం నీటి లభ్యత ఆశాజనకంగా ఉంది. అంతా బాగున్నా.. పంటలకు నీరందించేందుకు కరెంటు కష్టాలు వెంటాడుతున్నాయి. ఇన్నాళ్లు బోర్లలో నీటి కోసం అవస్థలు పడుతూనే.. పంటలను బతికించుకుంటూ వచ్చారు. ప్రస్తుతం నీటి తిప్పలు లేకున్నా.. కరెంటు కష్టాలు రైతులను కలవర పరుస్తున్నాయి. కొన్ని రోజులుగా మండలంలోని ఆకుతోటపల్లి వ్యవసాయ ఫీడర్‌లో నిత్యం అంతరాయాలు ఏర్పడుతుండడంతో పంటలకు నీరందించేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. - ఆంధ్రజ్యోతి, అనంతపురంరూరల్

ఆకుతోటపల్లి ఫీడర్‌లో నిత్యం అంతరాయాలు

వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు
పంటకు నీరందించేందుకు అన్నదాతల అవస్థలు

నిత్యం అంతరాయాలే..

ఆకుతోటపల్లి వ్యవసాయ ఫీడర్ పరిధిలోకి మన్నీల, కందుకూరు గ్రామాలు వస్తాయి. మన్నీల పరిధిలో 400, కందుకూరు పరిధిలో 200 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటికింద 8 వేల ఎకరాల్లో పంట లు సాగులో ఉన్నాయి. అందులోనూ ఉద్యా న పంటలే అధికం. వెయ్యి ఎకరాల్లో దాని మ్మ, చీనీ, ద్రాక్ష, అరటి వంటి పంటలు సాగు చేశారు. వ్యవసాయానికి కరెంటు సరఫరా సమయంలో లోడ్ ఎక్కువై నిత్యం సమస్యలు తలెత్తుతున్నట్లు తెలుస్తోంది. తరచూ జంపర్లు తెగిపోతుండటం, ట్రాన్స్‌ఫార్మర్ల హెడ్ ఫీజులు కాలిపోవడం, ఓల్టేజీ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ ఫీడర్ 35 నుంచి 40 కిలోమీటర్లు ఉండ టం కారణంగా జంపర్లు ఎక్కడ తెగిపోయాయో తెలుసుకోవడానికి లైన్ మొత్తం పరిశీలించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మరమ్మతులు చేసి.. విద్యుత్ సరఫరా పునరుద్ధరించే సరికి గంటల సమయం పడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో రోజూ రెండు, మూడు గంటలు పంటకు నీరందించేందుకు వీలులేకుండా పోతోందని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం చీనీ, దానిమ్మ పంటలు కాపు దశలో ఉన్నాయి. చాలినంత నీరు ఇవ్వకపోతే దిగుబడులపై ప్రభావం పడుతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

అదనపు ఖర్చులతో మరింత నష్టం..

కరెంటు సరఫరాలో సమస్యలతో అదనపు ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఉన్నఫళంగా కరెంటు పోవడం.. రావడంతోపాటు ఓల్టేజీ సమస్యలతో మోటార్లు కాలిపోతున్నాయి. స్టార్టర్ పెట్టెలో వైర్లు, మోటార్ల విద్యుత్ తీగలు కాలిపోవడం నిత్యకృత్యంగా మారాయి. పదిహేనురోజుల్లో వందకుపైగా మోటార్లు కాలిపోయినట్లు తెలుస్తోంది. బోరుబోవుల్లోని మోటార్లు బయటకు తీసి, మరమ్మతులు చేసి.. మళ్లీ లోపలికి దింపాలంటే వేల రూపాయల ఖర్చుతో కూడుకున్న పని. మోటారు వైండింగ్, రవాణా ఖర్చులు పెరిగిపోతున్నాయి. ఒకసారి మోటారు సమస్య తలెత్తితే.. మరమ్మతులకు రూ.10వేలకుపైగా ఖర్చవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జంపర్లు తెగిపోతే.. రోజంతా కరెంటు లేనట్లే



అరెకరాలో అరటి, నాలుగెకరాల్లో చీనీ, రెండెకరాల్లో పశుగ్రాసం సాగు చేశా. కరెంటు సమస్య తీవ్రమైంది. లోడ్ ఎక్కువైపోయి జంపర్లు తెగిపోతున్నాయి. వాటికి మరమ్మతులు చేసి, తిరిగి అమర్చే సరికి ఆ రోజంతా వృథా అవుతోంది. దీంతో పంటలకు నీరివ్వలేని పరిస్థితి తలెత్తుతోంది. సబ్‌స్టేషన్ కోసం ఎన్నోసార్లు అధికారులకు విన్నవించాం. స్థలం లేదంటూ అధికారులు దాటవేస్తున్నారు. - సీవీ కొండయ్య, రైతు, మన్నీల గ్రామం

సబ్‌స్టేషన్ కోసం ఎదురుచూపు



విద్యుత్ సమస్య పరిష్కారానికి సబ్‌స్టేషన్ ఏర్పాటు ఒక్కటే మార్గం అన్న అభిప్రాయాలు ఆయా గ్రామస్థులు, రైతుల నుంచి వినిపిస్తున్నాయి. కొన్నేళ్లుగా సబ్‌స్టేషన్ కోసం రైతులు.. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల సబ్ స్టేషన్ మంజూరైనట్లు సమాచారం. స్థలం చూపితే సబ్‌స్టేషన్ నిర్మాణం చేపడతామని విద్యుత్ అధికారులు అంటున్నట్లు రైతులు చెబుతున్నారు. గ్రామ పరిధిలో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు తగినంత ప్రభుత్వ స్థలం లేకపోవడం సమస్యగా మారిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు సబ్‌స్టేషన్ ఏర్పాటుకు చొరవ చూపాలని రైతులు అంటున్నారు.

పంటలపై ప్రభావం: బయన్న, రైతు, మన్నీల గ్రామం



ఐదెకరాల్లో చీనీ, దానిమ్మ పంటలు సాగులో ఉన్నాయి. ప్రస్తుతం పంటలు చేతికొచ్చే దశలో ఉన్నాయి. లక్షలు పెట్టుబడి రూపంలో పెట్టా. ఇలాంటి సమయంలో కరెంటు అంతరాయాలు ఆందోళన రేపుతున్నాయి. కరెంటు ఎప్పుడొసుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. దీంతో పంటలకు సక్రమంగా నీరివ్వలేకపోతున్నాం.

ఉత్సాహంగా ఉద్యోగ మేళా



నియామక పత్రాలు అందజేస్తున్న మంత్రి డా.శరణప్రకాశ్ పాటిల్

రాయచూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవరణలో శనివారం నిర్వహించిన ఉద్యోగ మేళాకు జిల్లాతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వివిధ రాష్ట్రాలకు చెందిన పారిశ్రామిక వేత్తలు, పరిశ్రమలు 65కు పైగా కంపెనీలు మేలాలో పాల్గొని ఉద్యోగులను ఎంపిక చేయాల్సి ఉండగా కంపెనీ ప్రతినిధులందరూ సకాలంలో మేళాకు హాజరైయ్యారు. కాగా మేళాను ప్రారంభించేందుకు జిల్లా ఇంచార్జ్ మంత్రి డాక్టర్ శరణప్రకాశ్ పాటీల్ రావల్సి ఉండగా ఆయన మధ్యహ్నం 1 గంటకు వస్తారని తొలుత అధికారికంగా సమాచారం ఇచ్చారు. గంటన్నర దాటినా 3 గంటలు కావస్తున్నా మంత్రి రాకపోవడంతో మేళాకు హాజరైన నిరుద్యోగులు, కంపెనీల ప్రతినిధులు తీవ్ర నిరాశకు గురైయ్యారు. కాగా మేళాకు 6500 మందికి పైగా నిరుద్యోగులు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు మంత్రి చేతుల మీదుగా ధ్రువపత్రాలు, నియామక పత్రాలు అందజేశారు.

అనుమతులు లేకుండా రోడ్డు విస్తరణ పనులు



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మిగనూరు ప్రజలు

కంప్లి, మార్చి 01(ఆంధ్రజ్యోతి) : తాలుకా పరిధిలోని ఎమ్మిగనూరు గ్రామంలో కంప్లి కురుగోడు ప్రధానరోడ్డు విస్తరణ పనులు ఎలాంటి అనుమతులు లేకుండానే జరుగుతున్నాయని ఎమ్మిగనూరు గ్రామస్థులు తెలిపారు. శనివారం విలేఖరులతో శేకన్న, వెంకారెడ్డిలు మాట్లాడుతూ సుమారు 200 ఇళ్లు రోడ్డుకు ఇరువైపులా వున్నాయి. వీరితో ఎలాంటి చర్చలు జరుపకుండా పంచాయతీలో నిర్ణయం తీసుకుని రోడ్డు కొలతలు వేస్తున్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యేకు, పంచాయతీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. తమకు న్యాయం చేసి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలన్నారు. రోడ్డుకు 30-30 కొలతలు కూడా ఎలాంటి అనుమతులు లేకుండా వేశారని తెలిపారు. ఈ విషయంపైన అక్కడకు వచ్చిన అధికారులను అడిగేందుకు వెళ్లే సమయంలో పోలీసులు మాపై దౌర్జన్యం చేశారన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. సాయిబన్న, సాదిక్ అలీ బాషా, ఖాసీమ్ సాబ్, శేకన్న, షేషావలీ, విజయ్‌కుమార్, దొడ్డపీర్ సాబ్, యల్లమ్మ, నాయకర జడెప్ప, బసవరాజు, బసప్ప, ఇమామ్ సాబ్ పాల్గొన్నారు.